

# నీకో న్యాయం, నాకో న్యాయం

ప్రఫుల్లచంద్ర



**అధిక** జీతాల కోసం ఆందోళన ఉధృతం చేసి, నిరాహార దీక్షలో పాల్గొన్న లెక్చరర్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లో ఒక గంట ఉంచిన తరువాత వారిని వదిలేశారు. అప్పుడే ఇంటికెళ్లి చేసే దేముందని లెక్చరర్‌లు రోడ్డు మీదనే గుంపులుగా చేరి కబుర్లు చెప్పుకుంటూ ఉండగా -

రిక్షాలో వెళ్లిపోతున్న సరస్వతి కనిపించింది లెక్చరర్ జ్యోతికి.

సరస్వతి బుజ్జికి క్లాస్ టీచర్. ఆమె మూడు గంటలకే ఇంటికి వెళ్లిపోతాం దంటే ఈ రోజు కూడా క్లాసు కేన్సిల్ చేసిందన్నమాట! వారం రోజులుగా ఇదే వరస! జ్యోతి హృదయం భగ్గుమంది.

సరస్వతి ఇల్లు పక్కవీథిలోనే. జ్యోతి అక్కడకు వెళ్లింది.


నిరాడంబరంగా ఉన్న చిన్న ఇల్లు. ప్రయాణ సన్నాహం కాబోలు, కొంత సామాను పాక్ చేయబడి ఉంది. అయితే బుజ్జికి మరికొన్ని రోజులు క్లాసు ఉండదన్నమాట!

గెజిటెడ్ లెక్చరర్‌ని చూడగానే కాన్వెంట్ టీచర్ కంగారుపడింది. ఆమె నిజంగా కంగారు పడిందో, లేదో కాని జ్యోతికి అలా అనిపించింది.

సరస్వతి ఆహ్వానించగా కుర్చీలో కూర్చుంటూ, "ఏమిటీ, అప్పుడే ఇంటికొచ్చేశారు! సెలవుగాని పెట్టారా?" సౌమ్యంగానే అడిగింది జ్యోతి.

తల వంచుకుని మౌనంగా ఉండిపోయింది సరస్వతి.

"గత వారం రోజుల నుండి మా బుజ్జి




పెందరాళే ఇంటికొచ్చేస్తున్నాడు. క్లాసు కేన్సిల్ చేశారని చెబుతున్నాడు. మీరు సెలవు పెట్టేస్తున్నారట, స్కూలుకు వచ్చినా క్లాసు తీసుకోవడంలేదట!" సంజాయిషీ అడుగుతున్నట్లు అంది జ్యోతి.

సరస్వతి 'సారీ' చెప్పేస్తే ఉదారంగా క్షమించేసి వెళ్లిపోయేది, కాని ఈసారి కూడా సరస్వతి చెప్పకుండా నేల చూపులు చూస్తూ ఉండిపోయింది.

జ్యోతికి ఒళ్లు మండింది.

"ఒకటో క్లాసు కుర్రాడి నుంచి మూడు వేలు డొనేషన్, నెల నెలా వంద రూపాయల ఫీజు వసూలు చేస్తున్నారు ..."

ఆమె మాట పూర్తి కాకుండానే సరస్వతి అందుకుంది - "కానీ నాకు లభించే జీతం ఐదు వందలే!"

ఒక్కసారిగా రెచ్చిపోయింది జ్యోతి.

"జీతం తక్కువని పాఠాలు తక్కువగా చెబుతానంటారు! ఉద్యోగంలో చేరినప్పుడు జీతం ఎంత ఇస్తారో మీకు తెలియదా? ఆ జీతానికే పని చేయడానికి ఒప్పుకుని, ఇప్పుడేమో జీతం చాలదు, పని ఎగ్గొడతాను అనడం ద్రోహం కాదా! మీ జీతం రాళ్ల కోసం భావి భారత పౌరుల పునాదులనే కదిపివేస్తున్నారే! అన్యాయం కాదూ? జీతాలు పెంచమని మీరు యాజమాన్యంతో పోరాడండి! అంతేగాని క్లాసులు ఎగ్గొట్టి పిల్లల భవిష్యత్తు నాశం చేయకండి!" ఉరిమినట్లుగా అంది జ్యోతి.

సరస్వతి చిన్నగా నవ్వి, మృదువుగా అంది - "అయితే మమ్మల్ని సమ్మె చేయమంటారా?"

అమ్మో! సమ్మె!! వీళ్లు సమ్మె చేస్తే బుజ్జికి క్లాసులు పోవూ? మూడు వేలు డొనేషన్ కట్టి నెలనెలా వంద రూపాయలు జీతం చెల్లిస్తూ ...

"నా ఉద్దేశం సమ్మె చేయమని కాదు!" కుర్చీలో ఇబ్బందిగా కదులుతూ నసిగింది జ్యోతి.

సాయంకాలం నాలుగు గంటలైనా వాతావరణం చల్లబడలేదు. గాలి ఆడటంలేదు, ఫేన్ లేదు. చిరు చెమటతో ఒళ్లంతా చిరచిరలాడుతోంది.

కూజాలోని చల్లని నీళ్లు తెచ్చిస్తూ - "మరి మమ్మల్ని ఏం చేయమంటారో చెప్పండి, మేడమ్!" సలహా అడిగింది సరస్వతి.

ఆలోచిస్తున్నట్టు నెమ్మదిగా మంచినీళ్లు తాగుతూ, "ఒకప్పుడు నేనూ మీరు పనిచేస్తున్న కాన్వెంట్‌లోనే ఇంకా తక్కువ జీతానికే పనిచేశాను. కాని మీలాగా నే నెప్పుడూ క్లాసు కేన్సిల్ చేయలేదు. తక్కువో, ఎక్కువో ఒక జీతానికి ఒప్పుకున్న తర్వాత కష్టమో, నిష్ఠూరమో మనమే భరించాలి కాని, పిల్లల భవిష్యత్తు నాశం చేయడం ఏం న్యాయం చెప్పండి? క్లాసు ఎగ్గొట్టడం దొంగతనంతో సమానం" అంది జ్యోతి.

తనను దొంగతో పోల్చినందుకు సరస్వతి బాధపడలేదు. చిరునవ్వు చిందిస్తూ, తనూ ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ - "నేను దొంగనైతే మీరు గజదొంగ!" అంది సూటిగా.

జ్యోతి ముఖం ఎరుపెక్కింది. పూటకు లేకాణా లేని పంతులమ్మ - గెజిటెడ్ లెక్చరర్ అయిన తనను పట్టుకుని 'గజదొంగ' అంటుందా! ఎంత సాహసం?

"వాట్ డు యు మీన్?" గర్జించింది జ్యోతి.

"ఆవేశ పడకండి, మేడమ్! ఆలోచించండి. మీరొక గంట పాఠం చెప్పడానికి ప్రభుత్వం ఇచ్చే జీతం యాభై కంటే ఎక్కువే. మరి నాకు లభించేది ఐదు కంటే తక్కువే. ఒకటో క్లాసు కుర్రాడికి నాలుగు క్లాసులు కేన్సిల్ చేస్తే దేశ భవిష్యత్తు నాశం అయిపోయినట్లు బాధపడే మీరు, డిగ్రీ క్లాసులు వరుసగా కేన్సిల్ చేస్తున్నప్పుడు దేశ భవిష్యత్తు జ్ఞాపకం రాలేదా? ఒకటో క్లాసు పిల్లలేనా భావి భారత పౌరులు? డిగ్రీ చదివే వారు భారత పౌరులు కారా? పది పాఠాలకు గాను మీరు గత సంవత్సరం రెండే పాఠాలు చెప్పారట. మీరు స్టాఫ్ రూములో కూర్చుని వేడి వేడిగా రాజకీయాలు చర్చిస్తారు కాని, క్లాసు తీసుకో రనేది అబద్ధమా? ఆ లెక్కన నేను దొంగనైతే మీరు గజదొంగ కాదా?"

జ్యోతి ముఖం చెక్కు తీసిన బీట్‌రూట్ అయింది. హృదయం కుతకుతమంటూండగా - "డోంట్ టాక్ రబ్బిష్!" అని అరిచింది.

సరస్వతి చెక్కు చెదరలేదు. అదే మృదు గంభీర స్వరంతో అంది - "మా చెల్లి మీ విద్యార్థినే! గత సంవత్సరం మీరు సిలబస్ పూర్తి చేయకపోవడం వల్ల దాని పరీక్ష పోయింది. దేశం అంటే మీ బుజ్జి ఒక్కడే కాదు. దేశమంటే మీరూ, నేనూ, అందరూ! మీ అబ్బాయికి పాఠాలు పోతున్నాయని అంగలార్చడం కాదు, ఏ ఒక్క విద్యార్థికీ పాఠాలు పోకూడదు! కాన్వెంట్‌లో తక్కువ జీతానికే కట్టు బానిసగా పనిచేశారు. మరి ప్రభుత్వ ఉద్యోగంలో చేరగానే క్లాసులు ఎగ్గొట్టే లెక్చరర్‌గా ఎందుకు మారిపోయారు?"

"బస్, చాలు!" అరిచింది కుర్చీలోనుంచి. ఆమె ముఖంలోని నరాలు ఉబ్బిపోయాయి. కళ్లు డేంజర్ లైట్స్‌లా వెలిగాయి. ఆవేశంతో పూనకం వచ్చినట్టు ఊగిపోతూ, "మంచీ మర్యాదా లేకుండా వాగుతున్నావ్! న న్నేమనుకుంటున్నావ్? ఏం చూసుకుని ఆ మిడిసిపాటు? నీ ఉద్యోగం ఊడగొట్టిస్తా! ఈ ఊళ్లో మ రే కాన్వెంట్‌లోనూ ఉద్యోగం దొరక్కుండా చేస్తా!" రంకె లేస్తూ బయటకు వెళ్లిపోయింది జ్యోతి.

ఆ ఆర్భాటానికి ఆమె కూర్చున్న కుర్చీ గజగజలాడిపోయింది!

**   **   **

"ప్రిన్సిపాల్‌గారూ! ఒకటో క్లాసు కుర్రాడికి మేము మూడు వేలు డొనేషన్ కట్టి నెలనెలా వంద రూపాయలు జీతం కడుతున్న దెందుకు? ఆ సరస్వతి రోజూ క్లాసులు కేన్సిల్ చేస్తూంటే మీ రేం చేస్తున్నారు?" గద్దించింది జ్యోతి.

ఏదో ఫైలు మీద సంతకం పెడుతున్న ప్రిన్సిపాల్ బిత్తరపోయాడు. క్షణంలో పరిస్థితిని అర్థం చేసుకున్న అతడు ముందుగా ఆమెను కుషన్ కుర్చీలో కూర్చోబెట్టి, ఫ్రిజ్‌లోని చల్లని నీళ్లు ఇచ్చి, మర్యాద ఒలకబోస్తూ, "సారీ మేడమ్! ఇకపై అలా జరగదు!" అన్నాడు మృదువుగా.

మెత్తని కుర్చీ, చల్లని మంచినీళ్లు, పైగా ఏ.సీ. గది - చల్లబడిపోయింది జ్యోతి.

"ఇకపై సంగతి అలా ఉంచండి. ఆమె వారం రోజులుగా క్లాసులు ముందుగానే విడిచిపెట్టేసి ఇంటికి వెళ్తోంది, గమనించలేదా? మీ రేం చర్య తీసుకున్నారో చెప్పండి. ఒక పేరెంట్‌గా అడుగుతున్నా!" సౌమ్యంగానే అడిగింది.

ఆమె మెత్తబడటం గమనించిన ప్రిన్సిపాల్‌కి ధైర్యం వచ్చేసింది. "సారీ మేడమ్! సరస్వతి టీచర్ మీద చర్య తీసుకోవడానికి వీలు కాదు" అన్నాడు కాస్తంత హుందాగా.

"క్లాసులు ఎగ్గొట్టే టీచర్స్ మీద చర్య తీసుకోడానికి వీలు కాదా? ఆహాహ! ఏం గొప్ప స్కూలండీ మీది!" వెటకారంగా అంది జ్యోతి.

ఆ వెటకారంలోని ఆనందాన్ని అనుభవించేందుకు ఆమెకు కాస్త టైమిచ్చి, మృదువుగానే చెప్పాడు ప్రిన్సిపాల్ - "మేడమ్! గవర్నమెంట్ కాలేజీల్లో పని ఎగ్గొట్టినట్టు ప్రైవేటు సంస్థల్లో కుదరదని మీకు బాగా తెలును! మరో విషయం మీకు తెలియకపోవచ్చు. రిజైన్ చేసి వెళ్లిపోయిన వారిని శిక్షించడానికి వీలు కాదు! సరస్వతి టీచర్ మా సంస్థలో ఉద్యోగిని కాదు!"

"వాట్?! వాట్ డు యు మీన్?"

"లెక్చరర్ ఉద్యోగం దొరకడం వల్ల వారం రోజుల క్రితమే ఆమె రిజైన్ చేశారు. రేపే ఊరు విడిచి వెళ్లిపోతున్నారు. రిజైన్ చేసినా, కొత్త టీచర్‌ని నియమించేవరకూ పిల్లల పాఠాలు పోకూడదని ఉత్త పుణ్యానికి వచ్చి పాఠాలు చెబుతున్న ఆమె మీద ఏం చర్య తీసుకోవాలో ఇప్పుడు చెప్పండి, మేడమ్!"

★